సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



అర్థమయ్యే వరకు బోధించాలి
ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే వరకు బోధించాలని రంపచోడవరం పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. 8లో



రక్తదానంతో ప్రాణదానం
రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారిని ఆదుకునే అవకాశం దక్కుతుందని జేసీ అభిషేక్ గౌడ్ అన్నారు. 8లో



పాల సముద్రంలా..
అరకులోయ రూరల్: మండలంలోని జిగంగుడి వ్యూ పాయింట్ సమీపంలో పొగ మంచు పాల సముద్రాన్ని తలపించింది.

న్యూస్‌రీల్

వీఆర్వోలకు బదిలీలు
మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) గ్రేడ్–2 బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీల కోసం మొత్తం 234 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జీవో ప్రకారం మొత్తం 51 మందికి బదిలీలు నిర్వహించారు.

ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు
- అనంతగిరిలో అత్యధికంగా 65.2 మిల్లీమీటర్లు నమోదు



పాడేరులో కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: జిల్లాలోని పాడేరు డివిజన్ వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పాడేరులో వారపుసంతకు ఆటంకం ఏర్పడింది. వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. అత్యధికంగా అనంతగిరిలో 65.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అడ్డతీగలలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రమైన పాడేరులో 12.8, అరకులోయలో 12.4, పెదబయలులో 12.4, చింతపల్లిలో 12.2, డుంబ్రిగుడలో 10.4, జి.మాడుగులలో 10.2, హుకుంపేటలో 7.6, జి.కే.వీధిలో 6.4, ముంచంగిపుట్టులో 4.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

భవనాలకు త్వరితగతిన మరమ్మతులు
- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

కూనవరం: అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. శుక్రవారం చినార్కురు గ్రామంలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వర్షానికి భవనాలు కారిపోతున్నాయని తెలపడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం అభిరామ్, తహసీల్దార్ నాగబాబు, ఎంపీడీవో విజయ, ఏపీవో శ్రీకాంత్, ఏపీఎం భాస్కర్, వీఆర్వో ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మత్స్యకార సంఘాల బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: గిరిజన మత్స్యకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మత్స్యకార సంఘాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన మత్స్యకార సంఘాలను బలోపేతం చేసేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని ప్రభుత్వం ద్వారా అందిస్తామన్నారు. రాయితీపై చేపల వేట ఉపకరణాలు, వ్యాపారం కోసం ద్విచక్ర వాహనాలు, శీతలీకరణ పెట్టెలు సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యశాఖ అధికారి సీతారామరాజు, మత్స్యకార సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అరకులో భిన్న వాతావరణం



మధ్యాహ్నం కాస్తున్న ఎండ

అరకులోయ రూరల్: మండలంలో శుక్రవారం ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఎండకాసింది. రాత్రి అరకు పరిసర ప్రాంతాల్లో మంచు కురిసింది.

ఇసుక తోడేళ్లు

ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగుల్లో ప్రాణాలకు తెగించి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. వీటి వెనుక అధికార పార్టీ నేతలు ఉండటమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

- ప్రధానగెడ్డల్లో భారీగా అక్రమ తవ్వకాలు
- ఉధృత ప్రవాహంలో ప్రాణాలకు తెగించి గిరిజన కూలీల సేకరణ
- రవాణాలో టీడీపీ నేతలదే హవా
- దూరాన్ని బట్టి రెండు టన్నులకు రూ.6 వేల నుంచి రూ.12 వేలకు విక్రయం
- టిప్పర్లతో జోరుగా తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



దుంబ్రిగుడ గెడ్డలో ఇసుక తవ్వకాలు

సాక్షి, పాడేరు: ఇసుక వ్యాపారం **జోరుగా సాగుతోంది.** గెడ్డలు, వాగుల్లో యథేచ్ఛగా **తవ్వకాలు జరుగుతున్నాయి.** పాడేరు డివిజన్ పరిధి**లో డుంబ్రిగుడ,** హుకుంపేట, పాడేరు మండలా**ల్లో కొంతమంది** టీడీపీ నేతలు, అధికార పార్టీ **సానుభూతిపరులు** ఇసుక అక్రమ రవాణాలో **కీలకపాత్ర పోషిస్తున్నారు.** ఇటీవల కురిసిన వర్షాల**కు ప్రధాన గెడ్డలు,** వాగుల్లో నీటి ప్రవాహం అధికం**గా ఉంది. అయినప్పటికీ** ప్రమాదకర పరిస్థితుల్లో **ప్రాణాలకు తెగించి** కూలీలు తవ్వకాలు జరుపుతున్నా **అధికార యంత్రాంగం** పట్టనట్టు వ్యవహరిస్తు**ందన్న విమర్శలు** వ్యక్తమవుతున్నాయి.

అధిక ధరలకు విక్రయం

గెడ్డలు, వాగుల నుంచి సేకరించిన ఇసుకను భారీ **ధరలకు విక్రయిస్తున్నారు. గెడ్డ వద్ద గిరిజన కూలీలు సేకరించిన 2 టన్నుల ఇసుకను లోడింగ్‌తో కలిపి రూ.2,500కు వ్యాన్ ఆపరేటర్లు కొనుగోలు చేస్తున్నారు. అక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు** తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారు. గెడ్డ నుంచి 30 కిలోమీటర్ల లోపు అయితే రెండు టన్నుల **ఇసుకను రూ.6వేల నుంచి రూ.8 వేలు, ఇంకా ఎక్కువ దూరం అయితే రూ.8వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారు.**

తవ్వకాలు జరిగే ప్రాంతాలివే..

అనంతగిరి మండలంలోని గోస్తనీ నది, డుంబ్రిగుడ మండలంలో కురిడి, నారింజవలస, కించుమండ ప్రాంతంలోని కొండగెడ్డల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి అనంతగిరి,అరకు, డుంబ్రిగుడ వ్యాన్ ఆపరేటర్లు తరలిస్తున్నారు.

- హుకుంపేట మండలంలోని కామయ్యపేట శివారు మత్స్యగెడ్డలో మూడు చోట్ల ఇసుక తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. ప్రతిరోజు ఇక్కడి నుంచి 200 లోడ్‌ల వరకు పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు తరలిస్తున్నారు. రాత్రి,పగలు తేడా లేకుండా 24/7 ఇసుక వ్యాన్‌లతో హుకుంపేట – కామయ్యపేట రోడ్డు రద్దీగా ఉంటోంది. ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డలో ప్రమాదం అంచున గిరిజన కూలీలు ఇసుకను సేకరిస్తున్నారు.

అక్రమ తవ్వకాలను నియంత్రిస్తాం



ఏజెన్సీలో ఇసుక అక్రమ సేకరణ, రవాణా, అమ్మకాలను నియంత్రిస్తాం. ప్రధాన గెడ్డలలో ఇసుక సేకరణ, రవాణాను అడ్డుకునేలా రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలిస్తాం. ఇసుక అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని తగు చర్యలు తీసుకుంటాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు



కామయ్యపేట శివారులోని మత్స్యగెడ్డలోంచి ఇసుకను సేకరిస్తున్న కూలీలు



మత్స్యగెడ్డ నుంచి ఇసుక మోసుకువస్తున్న మహిళా కూలీ

ఓటేశారు.. ఎన్నుకున్నారు
- విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై అవగాహన కార్యక్రమం



క్లాస్ లీడర్ల ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న విద్యార్థినులు

సాక్షి,పాడేరు: స్థానిక సుండ్రుపుట్టులోని భారతీయ విద్యా కేంద్రంలో చిన్నారులకు భారత ఎన్నికల వ్యవస్థ, ఎన్నికలు, పోలింగ్, ఓటు హక్కు వినియోగం, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పదేళ్ల లోపు బాలబాలికలు తమ క్లాస్ లీడర్లను ఓటింగ్ విధానంలో ఎన్నుకున్నారు. విజ్ఞానం పెంపొందించడంలో భాగంగా ఎన్నికల ప్రక్రియపై చిన్నారులకు అవగాహన కల్పించామని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

పీజీ కోటా కుదింపుపై నిరసన



ఉద్యమ పోస్టర్లతో డీఎంహెచ్‌వో ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

- జీవో 85ను రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన పీహెచ్‌సీల వైద్యులు

సాక్షి,పాడేరు: ప్రభుత్వ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యుల పీజీ కోటాను కుదింపు చేస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని వైద్యులు ఆందోళనను కొనసాగిస్తున్నారు.దీనిలో భాగంగా పలు పీహెచ్‌సీలకు చెందిన వైద్యులంతా శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చారు. ఉద్యమ పోస్టర్లతో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా ఎదుట నిరసన తెలిపారు. జీవో నంబరు 85ను రద్దు చేయాలని వారంతా నినాదాలు చేశారు. తమకు అన్యాయం చేసే ఆ జీవోను వెంటనే రద్దు చేయకుంటే ఛలో విజయవాడ పేరిట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారంతా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌సీల వైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు ప్రతాప్, ఉపాధ్యక్షుడు సందీప్, కోశాధికారి జ్ఞానేశ్వరి,పలు పీహెచ్‌సీల వైద్యులు బిందు, డాక్టర్ సత్య, డాక్టర్ కిరణ్, డాక్టర్ లక్ష్మీకాంత్, మణిదీప్ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో 25 ఏళ్ల జైలు

రాజవొమ్మంగి/కాకినాడ లీగల్: ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పినట్టు రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన గునూరు వరహాలబాబు 2020 అక్టోబర్ 14న అదే ప్రాంతంలో ఆరేళ్ల బాలిక మంచంపై నిద్రిస్తుండగా లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు గమనించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో రాజవొమ్మంగి పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నిందితుడు వరహాలబాబుపై నేరం రుజువు కావడంతో పోక్సో చట్టం ప్రకారం 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా, మరో సెక్షన్ ప్రకారం 6నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాలికకు రూ.7లక్షల నష్టపరిహారం అందజేయాలని తీర్పులో పేర్కొన్నారు. రెండు సెక్షన్లకు ఏకకాలంలో జైలు శిక్ష అమలు జరపాలని తీర్పులో పేర్కొన్నారని సీఐ తెలిపారు.

విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్‌కు పోలీసు భద్రత తొలగింపు

మహారాణిపేట (విశాఖ) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉమ్మడి విశాఖ జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్రకు 1+1 ఉన్న పోలీసు భద్రతను తొలగించారు. మావోయిస్టు ప్రాబల్యం ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మారు మూల ముంచంగిపుట్టుకు చెందిన సుభద్రకు నిబంధనల మేరకు భద్రత కల్పించాలి. అయితే ఆమె గన్‌మెన్లు లేకుండా శుక్రవారం జెడ్పీ కార్యాలయానికి రావడంతో కొందరు విలేకరులు ప్రశ్నించగా.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలగించారని ఆమె బదులిచ్చారు. భద్రత కల్పించాలని డీజీపీ, డీఐజీ, ఇంటెలిజెన్స్ ఐజీకి లేఖ రాసినా ఎటువంటి సమాధానం రాలేదని తెలిసింది.

వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి

మనవడిని చూసేందుకు వెళ్తుండగా ప్రమాదం



కాంతమ్మ మృతదేహం

జి.మాడుగుల: మనవడిని చూసేందుకు బయలుదేరిన గిరిజన మహిళ మార్గం మధ్యలో వాగు దాటుతుండగా వరద ప్రవాహానికి కొట్టుకుపోయి మృతి చెందింది. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సొలభం పంచాయతీ బంగారుబుడేకు చెందిన ఆదివాసీ మహిళ కొర్రా కాంతమ్మ(49) వయ్యారిగరువు మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న మనవడిని చూసేందుకు బయలుదేరింది. మార్గం మధ్యలో వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయింది. అయితే ఆమె మనవడి దగ్గరకు వెళ్తున్న విషయం ఎవరికీ చెప్పలేదు. ఆమె ఎంతకీ ఇంటికి రాకపోవడంతో భర్త బాబూరావు, కొడుకు కొర్రా బాలరాజు కంగారు పడ్డారు. వెంటనే బుడ్డిగెడ్డ వాగు పరిసర ప్రాంతాల్లో వెతుకుతుండగా కాంతమ్మ మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని వారు పోలీసులకు తెలిపారు. కుమారుడు బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన కేసు దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

మీకోసంలో 126 వినతుల స్వీకరణ



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మావతి వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 126 వినతులను స్వీకరించారు. వీటిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో వినతులు ఎక్కువగా ఉన్నాయి. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ శర్మ, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర్‌బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఈఓ బ్రహ్మాజీరావు, డీఎల్పీవో పీఎస్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌బీఎస్ నందు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్‌కుమార్ రావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

డీపీఎం భాస్కర్



బరిసింగిలో కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం భాస్కర్



ఉద్యానవన పంటలపై కషాయాన్ని పిచికారీ చేయిస్తున్న డీపీఎం తదితరులు

సాక్షి,పాడేరు: గిరిజన రైతులంతా ప్రకృతి వ్యవసాయం అలవాటు చేసుకుని ఆరోగ్యకర పంట ఉత్పత్తులు సాధించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం భాస్కర్ కోరారు. మండలంలోని బరిసింగి, డోకులూరులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కషాయాల తయారీపై గిరిజన రైతులకు జిల్లా రైతుసాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం,వాసన్ సంస్థలు సంయుక్తంగా శిక్షణ తరగతులు నిర్వహించింది. ప్రకృతి వ్యవసాయానికి ముందుకు వచ్చిన రైతులకు జీవామృతం, ఘన జీవామృతం, పలు కషాయాల తయారీపై డీపీఎం భాస్కర్ అవగాహన కల్పించారు. ఉద్యానవన పంటలపై రైతులతో కషాయాల పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లో 94,270 రైతులు 1,74,908 ఎకరాల్లో ప్రకృతి విధానంలో వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. మంచి దిగుబడులు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్లు డాక్టర్ సన్నీ,బక్కారెడ్డి, ప్రోగ్రాం అధికారి నాయుడు, రైతుసాధికార సంస్థ సిబ్బంది రవీంద్ర, జానకి పాల్గొన్నారు.

వరద వీడింది.. నష్టం మిగిలింది

ఛిద్రమైన రవాణా మార్గాలు

గోదావరి, శబరి వరదలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. చాలాచోట్ల రోడ్డు అంచులు కోతకు గురయ్యాయి. వంతెనలు దెబ్బతిన్నాయి. అధికార యంత్రాంగం తక్షణ మరమ్మతులు చేపట్టకుంటే మళ్లీ వరదలు సంభవిస్తే నష్టం మరింత పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. – చింతూరు



చింతూరు– కంసులూరు రహదారిలో చింతూరు, బండారుగూడెం మధ్య భారీగా కోతకు గురైంది. దీంతో మార్గంలో నిత్యం ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు.



గొడ్లగూడెం–గూడూరు మార్గంలో గొడ్లగూడెం జంక్షన్ సమీపంలో రహదారి భారీగా కోతకు గురైంది. ఈ మార్గంలో మండలంలోని గ్రామాలతోపాటు ఒడిశా వెళ్తుంటారు.



చింతూరు– మారేడుమిల్లి ఘాట్‌రోడ్‌లో వ్యూ పాయింట్ సమీపంలోని కల్వర్టు పక్కనే రహదారి భారీగా కోతకు గురైంది. ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశముంది.



చింతూరు– వీఆర్‌పురం వెళ్లే ప్రధాన రహదారిలో చూటూరు, నర్సింగపేట నడుమ ప్రవహించే సోకిలేరు వాగుపై వంతెనపై ఒక వైపు భాగం కొట్టుకుపోయింది.

రాకపోకలకు అవస్థలు

ప్రకృతి సృష్టించిన విధ్వంసం నుంచి మండల ప్రజలు ఇప్పటికీ తేరుకోలేదు. మండల కేంద్రం నుంచి నీలవరం, కొత్తగూడెం వెళ్లే మార్గంలో పడిన గండిని నేటికీ పూడ్చకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గొర్రెలోవ వెళ్లే మార్గంలో బ్రిడ్జి కోతకు గురికావడంతో 8 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. – గూడెంకొత్తవీధి



← జీకేవీధి-కొత్తగూడెం మార్గంలో కోతకు గురైన రోడ్డు



గొర్రెలోవ మార్గంలో కోతకు గురైన బ్రిడ్జి →

క్లుప్తంగా

గవర్నర్‌కు వీడ్కోలు



వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు

గోపాలపట్నం: జిల్లాలో పర్యటించిన ఆంధ్రప్రదేశ గవర్నర్ అబ్దుల్ నజీర్ తిరుగు ప్రయాణమయ్యారు. ఆయనను విశాఖ విమానాశ్రయంలో అధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఘనంగా వీడ్కోలు పలికారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి, ఆర్‌డీఓ హుస్సేన్‌సాహెబ్ వీడ్కోలు పలికారు.

గడపరాయిలో కలప పట్టివేత

చింతపల్లి: గడపరాయి గ్రామంలో నిల్వ ఉంచిన రూ.రెండు లక్షల విలువ చేసే కలపను పట్టుకున్నట్టు రేంజర్ బి.అప్పారావు శుక్రవారం తెలిపారు. ముందస్తు సమాచారంతో స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి గడపరాయిలో కలపను స్వాధీనం చేసుకున్నామని దీని విలువ రెండు లక్షల రూపాయలు ఉంటుందని చెప్పారు. దీనిపై విచారణ నిర్వహిస్తున్నామని రేంజర్ తెలిపారు. దాడుల్లో స్క్వాడ్ రేంజ్ అధికారి గంగరాజు, సిబ్బంది ఉన్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

తగరపువలస(విశాఖ): భీమిలి బ్యాంకు కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలుడు చిన బజారుకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమపేరుతో వంచించి గర్భవతిని చేశాడు. ఈ మేరకు బాలిక తల్లి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి నగరంలోని జువైనల్ హోమ్‌కు తరలించారు. భీమిలి సీఐ బి.సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ వల.. చిక్కితే విలవిల..

- పెట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు
- టెక్నాలజీని వినియోగించుకుని చీటింగ్
- సురక్షిత డిజిటల్ లావాదేవీలతోనే సైబర్ నేరాలకు చెక్
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జిల్లాలో సైబర్ నేరాల వివరాలు	
సంవత్సరం	కేసులు
2021	128
2022	152
2023	201
2024(సెప్టెంబర్ 15 వరకు)	164



సాక్షి, అనకాపల్లి: ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. చాలా మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక విప్లవం.. ఎక్కువవుతున్న నగదు రహిత లావాదేవీలు.. అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ఓ రకంగా సన్మార్గాలే. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. రెండో పైపు కష్టజీవులను దోచుకునే సైబర్ బూచోళ్లు కాచుకుని కూర్చున్నారు. వారి ఉచ్చులో పడి ఇల్లు గుల్ల చేసుకునే వారి సంఖ్య అనేకం. గుర్తు తెలియని సోషల్ మీడియా ఖాతాల నుంచి గానీ.. ఫేక్ అకౌంట్‌ల నుంచి ఆన్‌లైన్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ గేమ్‌లు పేరిట లింక్‌లు వస్తే క్లిక్ చేసి మోసపోవద్దంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. అవగాహన లేక కొందరు .. తెలిసి కూడా మరికొందరు మోసపోతున్నారు. ఉపాధి పేరిట నిరుద్యోగులను.. ఆన్‌లైన్ గేమ్‌ల పేరిట యువతను సైబర్ నేరగాళ్లు బోల్తా కొట్టిస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం లాంటి నగదురహిత లావాదేవీలు ఎక్కువవడంతో యువత, ఉద్యోగులనే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు.

కొన్నిసార్లు డిజిటల్ లావాదేవీలలో తలెత్తే సమస్యల పరిష్కారాల కోసం గూగుల్, యూట్యూబ్‌ల్లో సెర్చ్ చేసుకుంటూ వాటి పరిష్కార మార్గాలు వెతుక్కుంటున్నారు. అయితే ఆ విధానం కొన్ని విషయాల్లో మంచిదైనా.. ఎక్కువ మంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు సైబర్ నేరగాళ్ల వలలో పడిపోవడానికి ఇది కూడా ఒక కారణమనే సైబర్ పోలీసులు చెబుతున్నారు. గూగుల్లోనే ఫేక్ యాప్‌లు, ఫేక్ లింక్‌లు అప్‌లోడ్ చేసి మొత్తం డేటాని తస్కరిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి.

యువత తస్మాత్ జాగ్రత్త

ప్రతి ఒక్కరికీ తెలియని సమచారం కోసం గూగుల్ సెర్చ్‌కు వెళ్లి వివిధ లింక్‌లను క్లిక్ చేస్తూ సమాచారం తెలుసుకోవడం అలవాటు. వీటిపైనే సైబర్ నేరగాళ్లు నిఘా పెడుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సప్, టెలిగ్రమ్ వంటి యాప్‌ల ద్వారా యువతను సైబర్ మోసగాళ్లు ఉచ్చులోకి లాగుతున్నారు. అందమైన అమ్మాయిల పేరిట ఫేక్ అకౌంట్‌లను క్రియేట్ చేసి గేలం వేయడం.. బ్యాంక్ ఫ్రాడ్ ఓటీపీలు, లింక్‌లు, కస్టమర్ కేర్ పేరిట సైబర్ నేరగాళ్లు మరింత మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో జిల్లాలో పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలలో ఎటువంటి సమస్య తలెత్తినా.. బ్యాంక్‌కు వెళ్లి సంప్రదించాలే తప్ప, గూగుల్‌లో సెర్చ్ చేయొద్దని హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తతే ఆయుధం..



ఇప్పుడు ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయి. పలువురు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. బాధితులు గోల్డెన్ అవర్‌లోపే పోలీసులకు ఫిర్యాదు చేస్తే రికవరీకి అవకాశం ఉంటుంది. 1930కు ఫోన్ చేసి, అదే విధంగా సైబర్‌క్రైం.జీవోవీ.కమ్‌లో కూడా ఫిర్యాదు చేయాలి. విద్యావంతులే ఎక్కువగా సైబర్ మోసాల బారిన పడడం ఆందోళన కలిగిస్తోంది. డబ్బు సులువుగా సంపాదించాలన్న అత్యాశకు పోయి మోసపోతున్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం.

– ఎం.దీపిక, ఎస్పీ, అనకాపల్లి

ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నాం..

బ్యాంక్ నుంచి ఫ్రాడ్ ఓటీపీలు, రుణాలు, కస్టమర్ కేర్ పేరిట ఖాతాదారులనే సైబర్ నేరగాళ్ల టార్గెట్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 252 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లు, 400కు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ఏటీఎంలున్నాయి. అన్ని బ్రాంచిల్లోనూ పోలీసులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సైబర్ నేరగాళ్ల వలలో పడి ఖాతాదారులు మోసపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– సత్యనారాయణ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్

సురక్షిత డిజిటల్ లావాదేవీలు ఇలా..

- బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డుల వివరాలు ఎవరితో కూడా పంచుకోకూడదు.
- ఆన్‌లైన్‌లో డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు బార్‌కోడ్‌లు, క్యూఆర్ కోడ్‌ల స్కానింగ్ చేయొద్దు.
- ఫోన్‌కాల్, ఈ–మెయిల్ చేసి మీ కేవైసీ అప్‌డేట్ చేయాలని వివరాలు అడిగినా చెప్పొద్దు. అనుమానం ఉండే బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లి చెక్ చేయండి. హోం బ్యాంక్ శాఖను సంప్రదించడం ఉత్తమం.
- ఈ–మెయిల్‌లు, ఎస్ఎంఎస్‌లలో యూఆర్ఎల్, డొమైన్ పేర్లలో స్పెల్లింగ్ లోపాలుంటే జాగ్రత్తగా తనిఖీ చేయండి. ఇవి 'హెచ్‌టీటీపీఎస్'తో ప్రారంభమవుతాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అధికార వెబ్‌సైట్‌లనే ఉపయోగించండి.
- ఏదైనా వెబ్‌సైట్, అప్లికేషన్‌లో మీ ఈ–మెయిల్‌ను యూజర్ ఐడీగా నమోదు చేస్తున్నప్పుడు మీ ఈ–మెయిల్ పాస్‌వర్డ్‌ను 'పాస్‌వర్డ్'అని పెట్టుకోవద్దు.
- పొరపాటున మీ ఫోన్ పే, గూగుల్ పే ఖాతాలలో డబ్బులు వేశామని, వాటిని వెనక్కి పంపండి.. అని మీకు ఎవరైనా కాల్ చేసినట్లయితే తిరిగి డబ్బులు పంపకండి.
- గూగుల్ సెర్చ్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతుకుతున్నప్పుడు నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి. అప్రమత్తంగా ఉండాలి.
- ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ పేరిట బ్లాక్ మెయిల్ చేసి నేరాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో మిమ్మల్ని ట్రాప్ చేయడానికి మీకు గిఫ్ట్ కూపన్లను కూడా పంపించే అవకాశాలు ఉన్నాయి. డేటింగ్ సైట్లు, డేటింగ్ యాప్స్‌పై జాగ్రత్తగా ఉండాలి.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, శాస్త్రవేత్తలు

చింతపల్లి: సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శివకుమార్ అన్నారు. విజయవాహిణి చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు ఉద్యాన పరిశోధన స్థానం కలిసి పసుపు, మిరియాల సాగులో మేలైన పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండవంచుల, లక్కవరం గ్రామాలకు చెందిన రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు.దీనిలో శాస్త్రవేత్తలు డాక్టర్ అప్పలరాజు, డాక్టర్ శివ కుమార్, హార్టికల్చర్ అధికారి బిందు పాల్గొన్నారు.

అర్థమయ్యే వరకు బోధించాలి

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే వరకు బోధించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. మండలంలోని బూసిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సబ్‌కలెక్టర్ కల్పశ్రీతో కలిసి సందర్శించారు. ముందుగా తరగతి గదులను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఎప్పకప్పుడు సిలబస్ పూర్తి చేసి విద్యార్థులకు పాఠాలు అర్థమవుతున్నాయో లేదో తెలుసుకోవాలని సూచించారు. మెనూ అమలుపై నిర్లక్ష్యం చేయకుండా కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఆహార నాణ్యత లోపిస్తే చర్యలు

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



బాలికల వసతి గృహం పరిసరాలను పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



డుంబ్రిగుడలో విద్యార్థులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట: సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉంటున్న వసతి గృహాల్లో ఆహార నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. వసతి గృహాల పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే స్వగ్రామం కొంతిలిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం నిర్మాణానికి రూ.5లక్షలను మంజూరు చేసినట్టు చెప్పారు. సర్పంచ్ రేగం రమేష్, నాయకులు గండేరు చినసత్యం, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

డుంబ్రిగుడ: డ్రాప్ అవుట్ విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో పాఠాలు బోధించాలని సూచించారు. కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు నేలపై కూర్చుని చదువుతుండడంతో వారికి బెంచీల ఏర్పాటుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందజేయాలని ఆదేశించారు. పాఠశాలలో త్రీ ఫేస్ విద్యుత్ సౌకర్యం కోసం సంబంధిత జేఈతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారనికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను, ప్రిన్సిపాల్ భవాని తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ సుజాత, కృష్ణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



సీఐ హిమగిరి

అరకులోయ టౌన్: జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు అరకులోయ సర్కిల్ పరిధిలోగత అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలలో ఎవరైనా ఎటువంటి అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రిని తయారు చేయడం గాని లేదా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హిమగిరి చెప్పారు. ఈ మేరకు ఎటువంటి లైసెన్సు లేకుండా బాణసంచా నిల్వచేసిన, అనుమతి లేకుండా అమ్మకాలు చేసిన వారిపై నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పోలీసులతో ప్రత్యేక నిఘా



ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: అనుమతి లేకుండా బాణసంచాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కె.పాపినాయుడు హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనుమతి తీసుకోని బాణసంచా విక్రయించాలన్నారు. మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాల భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. రాత్రిళ్లు కూడా ప్రత్యేక పోలీసుల బలగాలతో ప్రధాన రోడ్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సెల్ టవర్ల వద్ద పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి సాగు, రవాణాపై సమాచరం అందిస్తే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

- జేసీ అభిషేక్ గౌడ్
- 30 యూనిట్లు సేకరణ

పాడేరు : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారిని ఆదుకునే అవకాశం దక్కుతుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లాలో రక్త నిల్వల పెంపునకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో 30 యూనిట్ల రక్త సేకరణ గొప్ప విషయమని రక్తదానం చేసిన ప్రతి విద్యార్థిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి కోఆర్డినేటర్ లోహిత్‌శ్, సభ్యులు గౌరీశంకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ కంపెనీ పేరు మార్పు

సాక్షి, అనకాపల్లి: అచ్యుతాపురంలో బ్రాండిక్స్ తన ప్రయాణంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ(బీఐఏసీ) పేరిట ఉన్న పేరును 'అధిస్టాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్'గా శుక్రవారం రీ బ్రాండింగ్ చేసినట్లు ప్రకటించింది. 2006లో ప్రారంభమైనప్పటి నుంచి బీఐఏసీ ఇంటిగ్రేటెడ్ హబ్‌గా అభివృద్ధి చెందుతూ.. 1,00,000 మందికి ఉపాధి కల్పించినట్లు కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జాతీయ కస్టమర్లకు సానుకూలమైన సమగ్ర వాతావరణాన్ని సృష్టించే దిశగా ఈ మార్పు చేసినట్టు తెలిపారు. 1,000 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్క్ అపెరల్‌తో పాటు ఇతర పరిశ్రమలకు కేంద్రంగా వైవిధ్యమైన సుస్థిర వాతావరణంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

పరిశ్రమలు కాదు మృత్యు కుహరాలు

- సెజ్‌లలో రక్షణ చర్యలకు తిలోదకాలు
- పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వాలు
- ఏపీని ఆదానీ, అంబానీలకు తాకట్టు పెడుతున్న ప్రజాప్రతినిధులు
- ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత రక్షణ యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అనకాపల్లి/అచ్యుతాపురం (మునగపాక): పరవాడ–అచ్యుతాపురం సెజ్‌లో పరిశ్రమలు మృత్యు కుహరాలుగా మారాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. జిల్లాలో ఐదు రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత, రక్షణ యాత్ర అచ్యుతాపురంలో శుక్రవారం ముగిసింది. ఫార్మా కంపెనీల్లో ఇటీవల ఘోర ప్రమాదాలు జరగడంతో కార్మికుల రక్షణ కోరుతూ సీపీఎం యాత్ర నిర్వహించింది. ముగింపు సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరవాడ–అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా కెమికల్ ఇతర పరిశ్రమలలో ప్రమాదాలు జరుగుతూ కార్మికులు మృత్యువాత పడుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఈ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని కూడా అరికట్టలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రజలకు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నా పట్టించుకునే నాథుడే లేరని, పర్యావరణాన్ని సర్వనాశనం చేస్తున్నా ప్రశ్నించే వారే లేరన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ నెం.1గా ఉందని చెప్పుకుంటున్నారే గానీ.. ఈజ్ ఆఫ్ డెత్ బిజినెస్‌గా రాష్ట్రం మారుతుందని ఎందుకు గ్రహించడం లేదని ధ్వజమెత్తారు. ఆదానీ, అంబానీ లాంటి సంపన్నుల కోసమే ప్రధానమంత్రి మోదీ పనిచేస్తున్నారన్నారు.

భూ సేకరణ సరే.. పరిశ్రమలు ఎక్కడ?

పారిశ్రామిక కారిడార్ పేర్లతో లక్షల ఎకరాలు సేకరిస్తున్నారని, ఇటీవల కాలంలో కాకినాడలో 10,000 ఎకరాలు సేకరించి 150 ఎకరాల్లో ఒక్క పరిశ్రమ మాత్రమే తీసుకొని వచ్చారని శ్రీనివాసరావు అన్నారు. చెన్నై–విశాఖ కారిడార్ కోసం ప్రభుత్వం 2.5 లక్షల ఎకరాల భూసేకరణ చేసిందని.. ఇప్పటివరకూ పరిశ్రమలు రాలేదన్నారు. పెత్తందారుల కబంధ హస్తాల్లో ఎన్నాళ్లు మగ్గుతారని, ముందుకు వచ్చి పోరాడండి అని పిలుపునిచ్చారు. పరిశ్రమలకు నీళ్లు, కరెంటు, భూములు ఇవ్వటంపై దృష్టి సారిస్తున్న ప్రభుత్వాలు.. అవే పరిశ్రమలు ఎటువంటి భద్రత చర్యలు తీసుకోకపోయినా పర్వాలేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని కాపాడకుండా తెగనమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రధాని మోదీ చెప్పిందే వేదంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ రక్షణ యాత్రలో భాగంగా పాయకరావుపేట నుంచి పరవాడ వరకు యాత్ర నిర్వహించి కార్మికులు, నిర్వాసితుల సమస్యలు తెలుసుకున్నామన్నారు. ప్రజలకు, కార్మికులకు అండగా ఎర్రజెండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల దివంగతులైన సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఈ సందర్భంగా నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు బి.ప్రభావతి, జిల్లా కార్యదర్శి ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి రొంగలి రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నేతలు డి.వెంకన్న, ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, జి.దేముడుబాబు, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, పి.మాణిక్యం పాల్గొన్నారు.